## క్లుప్తంగా

### ఆర్డీటీ హాకీ అకాడమీకి విద్యార్థినుల ఎంపిక



ఆర్డీటీ అకాడమీకి ఎంపికైన విద్యార్థులు

**కళ్యాణదుర్గం:** ఆర్డీటీ హాకీ అకాడమీకి ఐదు గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని హాకీ కళ్యాణదుర్గం క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.తిమ్మరాజు ఆదివారం తెలియజేశారు. ఎంపికైన విద్యార్థినులకు ఉచిత వసతి, సౌకర్యం, భోజన వసతితో పాటు అంతర్జాతీయ స్కూల్‌లో విద్యకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్డీటీ హాకీ అకాడమీకి ఎంపికైన విద్యార్థినులను హాకీ కళ్యాణదుర్గం క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.తిమ్మరాజు, హాకీ మారెంపల్లి క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.బాబు, కోశాధికారి రఘు, కరణం చిక్కప్ప స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, కుళ్లాయప్ప, హాకీ కోచ్ అక్రమ్ బాషా, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

### రేపు వైఎస్‌ఆర్ జయంతి

**కూడేరు:** మండల కేంద్రంలో ఈనెల 8న వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ నారాయణ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బస్టాండ్‌లో రాజశేఖర్ విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేయ నున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు.

### జగ్జీవన్ రామ్ వర్ధంతి



ఉరవకొండలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

**ఉరవకొండ:** స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్, దళిత, గిరిజన సాధన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు గోపాల్, ప్రజాసంఘాల ప్రతినిధి పాల్తూరు ఆనందరాజు మాట్లాడారు.

### వెండి గుర్రం, శంకుచక్రాలు వితరణ



ఆమిద్యాలలో వెండి గుర్రం, శంకుచక్రాలను అందిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దంపతులు

**ఉరవకొండ:** ఆమిద్యాల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రుషేంద్ర, ప్రశాంతి దంపతులు వెండితో తయారు చేయించిన 2 కేజీల గుర్రం, శంకుచక్రాలను పెద్ద వన్నూరుస్వామి, చిన్న వన్నూరుస్వామి పీర్లకు ఆదివారం అందించారు. ఇంటి వద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా గుర్రం, శంకుచక్రాలను పీర్ల చావిడి వరకు తీసుకొచ్చారు. పీర్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మొక్కులో భాగంగా వాటిని పీర్ల దేవుళ్లకు అందించారు.

### వర్షానికి దెబ్బతిన్న పంటలు



కలిగొలిమి వద్ద నేలకొరిగిన రాగిపంట

**కుందుర్పి:** డివిజన్ వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న జడివానకు రాగి, మొక్కజొన్న పంట లు దెబ్బతిన్నాయి. వర్షానికి పొలాల్లోనే రాగి, మొ క్కజొన్న కంకులు నేలరాలాయి. మరికొన్ని చోట్ల కంకులు రంగు మారాయి. దీంతో మార్కెట్లలో ధరలు పలకడంలేదని కలిగొలిమి, నాగేపల్లి, వెంటకంపల్లి, మాయదార్లపల్లి తదితర గ్రా మాల రై తులు తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా 490 ఎకరా ల్లో రాగి, 970 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

### బొలెరో వాహనం బోల్తా



యాటకల్లు మలుపు వద్ద బోల్తా పడిన వాహనం

**శెట్టూరు:** యాటకల్లు ప్రధాన రహదారి మలుపు వద్ద టమాట బాక్సుల బొలేరో వాహనం బోల్తా పడింది. శనివారం అర్ధ రాత్రి శెట్టూరు నుంచి అనంతపురం టమాట మార్కెట్‌కు వెళ్తుండగా యాటకల్లు మలుపు వద్దకు రాగానే స్టీరింగ్ విరిగి పోయింది. దీంతో వాహనం రోడ్డు పక్కన బోల్తా పడింది. డ్రైవర్ తిమ్మరాజు సురక్షితంగా బయటపడ్డాడు. సుమారు 150 బాక్సుల టమాటాలు నేలపాలయ్యాయి.



బొమ్మనహాళ్‌లో కొలువుదీరిన పీర్లు





ఉరవకొండలో వేలాది భక్త జనం నడుమ జలధికి తరలివెళుతున్న లాల్‌స్వామి పీర్లు

# భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



ఎన్.హనుమాపురంలో లాలుస్వామి పీర్ల ఊరేగింపు



వజ్రకరూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



భూపసముద్రంలో ఊరేగుతున్న పీర్లస్వాములు



బ్రహ్మసముద్రంలో జలధికి బయల్దేరిన పీర్లస్వాములు



భేటీ అయిన రుద్రంపల్లి, ఎనుములదొడ్డి పీర్లు



రాయదుర్గంలో కొలువుదీరిన పీర్లస్వాములు



చిన్నారులను చక్కెర తూకం వేయిస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్ల చావిళ్ల వద్ద ఆదివారం పెద్ద సరిగెత్తు వైభవంగా జరిగింది. అగ్నిగుండాల(అలాయి) వద్ద రాత్రి అలాయ్ ఆడారు. బళ్లారి రోడ్డులోని ఉచ్చుబాయి పీర్ల దర్శనానికి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పోటెత్తారు. గొందిబావిలోని పెద్దపీర్ల చావిడి, చమ్మా పీర్లచావిడికి భక్తులు తరలివచ్చారు. కులమతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చి చక్కెర చదివింపులు చేశారు. చివరిరోజు సోమవారం పీర్ల జలధి కార్యక్రమంలో భాగంగా కోట ఊరువాకిలి వద్ద పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు.

**బొమ్మనహాళ్:** మండల వ్యాప్తంగా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగ వేడుకలు ఘనంగా ఆదివారం జరిగాయి. మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, ఉంతకల్లు, కృష్ణాపురం, బండూరు, కొలగానహళ్లి, ఏళంజి, కానాపురం, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కల్‌హోళ లో పీర్లపండుగ జరిగింది. సోమవారం పీర్లు ఊరేగింపు, సాయంత్రం జలధి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

**బ్రహ్మసముద్రం :** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మసముద్రం, సంతే కొండాపురం, వేపులపర్తి , భైరసముద్రం తదితర గ్రామాల్లో పీర్ల చావిడి వద్ద కొలువుదీరిన పీర్లకు భక్తులు చెక్కర, బెల్లం పానకాలు సమర్పించారు. సాయంత్రం జలధికి తరలివెళ్లాయి.

**గుమ్మఘట్ట:** మండలంలోని తాళ్లకెర, భూపసముద్రం గ్రామాల్లో వెలసిన పీర్ల స్వాములు ఆదివారం జలధికి తరలివెళ్లాయి. పీర్లస్వాములకు బెల్లం, చక్కెరతో చదివింపులు చేయించారు. పీర్ల స్వాములను గ్రామంలో ఊరేగించిన అనంతరం జలధికి తరలించారు.

**కుందుర్పి:** మండలంలోని ఎనుములదొడ్డి, రుద్రంపల్లి, ఓబుగానిపల్లి, తెనగల్లు, మలయనూరు గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు జలధితో ముగిసింది. సాయంత్రం ఆయా గ్రామాల్లో పీర్లను గ్రామోత్సవంగా జలధికి తీసుకెళ్లారు.

**ఉరవకొండ:** ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన లాల్ స్వామి పీర్లు భక్తిశ్రద్ధలతో జలధికి తరలివెళ్లాయి. పట్టణంలో పలు పీర్లు కుడా ఉరవకొండ బీబీ జైనబ్బీ దర్గా ఆవరణలో పెద్ద ఎత్తున ఊరేగింపుగా చేరి పీర్లు ఒకరి ఒకరు ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, జలధి నిర్వహించారు.

**కణేకల్లు:** మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రజలు మొహర్రం వేడుకలను జరుపుకున్నారు. ఐదు రోజుల క్రితం కొలువుదీరిన లాలుస్వామి పీర్లదేవుళ్లను భక్తులు చెక్కెర ఫాతేహాలు, చక్కెర చదివింపులు చేశారు. ఆదివారం ఊరేగింపు... జలధి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి పీర్లదేవుళ్ల ఊరేగింపు ప్రారంభమైంది.

**వజ్రకరూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. స్థానిక లాలుస్వామి,కటికెల స్వామి, తల్లి పీరా, హుసేన్, హుసేన్, ఇమామ్ ఖాసీమ్ తదితర పీర్ల చావడిలో ప్రత్యేక పూజలు చేశారు.

**గూళ్యపాళ్యంలో వైభవంగా పెద్ద సరిగెత్తు**

**వజ్రకరూరు:** మండల పరిధిలోని గూళ్యపాళ్యంలో మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పెద్ద సరిగెత్తు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయంలో లాలుస్వామి, బర్జిస్వామి, హుసేన్, చిన్నలాలుస్వామి, హుసేన్, కాశీం, చిన్నహుసేన్ తదితర పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



ఉరవకొండ క్లాక్‌టవర్ వద్ద ఏకలవ్య జయంతి నిర్వహిస్తున్న ఎరుకుల సేవా సంఘం నాయకులు

**ఉరవకొండ:** ఉరవకొండలో ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి ఏకలవ్యుడి చిత్రపటంతో భారీ ర్యాలీ చేశారు. అనంతరం కవితా హోటల్ సర్కిల్ వద్ద ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొలేగుండ్ల శేఖర్, నియోజవర్గ అధ్యక్షులు సాకేవసంత్ ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, భారీ కేక్ కట్ చేశారు. అనంతరం వందలాది మందికి ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ మండల, పట్టణ అధ్యక్షులు ముష్టూరు రాజు, వీరేంద్ర, విడపనకల్లు అధ్యక్షుడు అంజి, పట్టణ నాయకులు సాకే పురుషోత్తం పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గం రూరల్:** మండలంలోని ఉప్పొంక గ్రామంలో ఆదివారం ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌డీటీ ఆసుపత్రి ఎదుట 300 మందికి ఉచిత అన్నదానం చేశారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్ , ఎరుకుల సంఘం రాష్ట్ర నాయకులు ఎర్రిస్వామి, మల్లికార్జున, నాగేంద్ర, రవి, రాజేష్, నరేంద్ర, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## విరబూసిన బ్రహ్మ కమలాలు



ఉరవకొండలో విరబూసిన బ్రహ్మకమలాలు



కొకుంట్లలలో విరబూసిన బ్రహ్మకమలాలు



వడ్డే హనుమంత రాయుడు ఇంట్లో ...

**ఉరవకొండ:** మండలంలోని పెద్దకొకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు వసంతమ్మ, ఉరవకొండకు చెందిన ఎస్సీ విభాగం పట్టణ అధ్యక్షుడు మీనుగ గంగాధర్ ఇంట్లో శనివారం అర్ధరాత్రి బ్రహ్మకమలాలు పూశాయి. తొలి ఏకాదశి సందర్భంగా బ్రహ్మకమలాలు పూయడం శుభసూచకమని స్థానికులు తెలిపారు. అనంతరం గంగాధర్, వసంతమ్మ కుటుంబ సభ్యులు బ్రహ్మకమలాలకు ప్రత్యేక పూజలు చేశారు.

**కళ్యాణదుర్గం:** కంబదూరు మండల కేంద్రంలోని వడ్డే కాలనీలో నివాసం ఉంటున్న వడ్డే హనుమంత రాయుడు ఇంటి ఆవరణలో శనివారం రాత్రి బ్రహ్మకమలం విరబూసింది. ఒక్కసారిగా బ్రహ్మకమలం పూయడంతో స్థానికులు పుష్పాలను చూడటానికి తరలివచ్చారు. కుటుంబ సభ్యులు పుష్పాలకు ప్రత్యేక పూజలు చేశారు.

# ఘనంగా తొలి ఏకాదశి పూజలు



బొమ్మనహాళ్: పాండురంగస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఉరవకొండలో పాండురంగస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**రాయదుర్గం:** నియోజకవర్గంలో తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పూజలు చేశారు. రాయదుర్గంలోని బళ్లారి రోడ్డు లో ప్రసిద్ధి చెందిన పాండురంగ స్వామి ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించారు. లక్ష్మీబజార్‌లోని లక్ష్మీనారాయణ ఆలయంలోనూ ఏకాదశి పూజలు నిర్వహించారు.

**బొమ్మనహాళ్:** ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. విఠల విఠల... రుక్మిణీ పాండురంగ విఠల అంటూ భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేసింది. బొమ్మనహాళ్ పాండురంగ స్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు.

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టణంలోని లక్ష్మీనరసింహ ఆలయంతోపాటు, వెంకటేశ్వర స్వామి ఆలయం, ఒంటిమిద్దిలోని శ్రీరాముల ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 8 గంటలకు పాండురంగస్వామి రథోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

**గరుడ వాహనం విహరించిన పాండురంగుడు**

**ఉరవకొండ:** నియోజకవర్గంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉరవకొండ బ్రహ్మణవీధిలోని పాండురంగస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. స్థానిక చౌడేశ్వరీ కాలనీలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు.

**బెళుగుప్ప:** మండలంలోని ప్రముఖ ఆలయాల్లో తొలిఏకాదశి పండుగ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణస్వామి, ఆంజనేయస్వామి ఆలయం, బెళుగుప్పలోని రామేశ్వరస్వామి , వెంకటేశ్వరస్వామి, షిర్డీసాయి, విఘ్నేశ్వర స్వామి, మంజునాథస్వామి ఆలయం, రంగాపురంలోని రంగనాథస్వామి, నక్కలపల్లిలోని షిర్డీసాయినాథుడి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు చేశారు.

**వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం**

**వజ్రకరూరు:** స్థానిక బలిజవారివీధిలోని సీతారామస్వామి ఆలయలో ఆదివారం తొలిఏకాదశిని పురస్కరించుకుని సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆలయంలో సీతా రా మ, లక్ష్మణ, ఆంజనేస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదా లు పంపిణీ చేశారు.



రాయదుర్గంలో అలంకరణలో పాండురంగస్వామి



మురడి ఆంజనేయస్వామి ఆలయంలో జిల్లా అదనపు జడ్జి సత్యవాణికి స్వామివారి చిత్ర పటం అందిస్తున్న అర్చకులు



కళ్యాణదుర్గం కోట వీధిలో అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



బెళుగుప్పలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి



ఉరవకొండ: వెంకటేశ్వరస్వామి మూలవిరాట్

### రేపటి నుంచి రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో

**కళ్యాణదుర్గం:** నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న ‘రీకాలింగ్ చంద్రబాబూ మేనిఫెస్టో’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నేతలు అమలుకాని హామీలు ఎన్నో ఇచ్చారన్నారు. దీనిపై బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 8న ఉదయం 10.30 గంటలకు బ్రహ్మసముద్రం, 9న ఉదయం 10.30 గంటలకు కుందుర్పి, మధ్యాహ్నం 3.30 గంటలు కంబదూరు, 10న ఉదయం 10.30 గంటలకు శెట్టూరు, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, రూరల్ మండలాలు మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాలలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, మున్సిపల్ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, నాయకులు తప్పక హాజరుకావాలని సూచించారు.

### ‘పీఎం ఫసల్ బీమా’కు దరఖాస్తు చేసుకోండి

**కుందుర్పి:** ప్రధాన మంత్రి పసల్ బీమా యోజనకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులతోపాటు ఆయా మండలాల కౌలు రైతులు పథకానికి అర్హులన్నారు. వరికి ఎకరాకు రూ.800, ఆగస్టు 15లోపు, మిరపకు రూ.1800, మినుములకు రూ.400, కందికి రూ.400 జూలై 31లోపు, పత్తికి రూ.1900, ఈనెల 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు రుణాలు తీసుకుంటే బ్యాంకుల ద్వారానే ప్రీమియం చెల్లించొచ్చని అన్నారు.

### విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



బ్రహ్మసముద్రం బెల్టు షాపులో శనివారం అర్ధరాత్రి వేళ మద్యం విక్రయిస్తున్న దృశ్యం

**బ్రహ్మసముద్రం :** మండలంలో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. పరిధిలోని వేపులపర్తి గ్రామంలో ప్రభుత్వం లైసెన్సు దుకాణం ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 50కి పైగా బెల్టు షాప్ లు ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా దర్జాగా మద్యం విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో ఇటీవల ఓ టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాన్ని వేకువజాము నుంచి అర్ధ రాత్రి 1 గంట వరకు నిర్వహిస్తున్నారు. రాత్రివేళలో మద్యం ప్రియులు బెల్టు షాపుల వద్ద చేరి, గొడవలు పడుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. మొహర్రం పండుగను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం బెల్టు షాపు వద్ద కొందరు మద్యం మత్తులో గొడవ పడ్డారు. ఘర్షణ కాస్త పెద్దదయ్యింది. ఒకరినొకరు భౌతికదాడి చేసుకునే స్థాయికి వెళ్లింది. ఇరువర్గాలకు సర్దిచెప్పేందుకు బెల్టుషాపు నిర్వాహకుడి వెళ్లగా, అతనిపైనే దాడి చేశారు. కూత వేటు దూరంలో ఉన్న పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు చర్చించుకున్నారు.

### నేడు మంత్రి పర్యటన

**ఉరవకొండ:** పట్టణంలో మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం పర్యటించనున్నారు. ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక తాగునీటి పైప్‌లైన్ ప్రారంభోత్సవం, ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు భూమి పూజ, అనంతరం రాయంపల్లి రోడ్డు, పాల్తూరు రోడ్డు, కణేకల్లు క్రాస్ నుంచి ఉరవకొండ టౌన్ మీదుగా నూతన రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేయనున్నారు.

### ప్రాంతీయ పశువైద్యశాలలో జూనోసిస్ డే



పెంపుడు జంతువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి

**రాయదుర్గంటౌన్:** ప్రాంతీయ పశువైద్యశాలలో జూనోసిస్ డేను ఆదివారం నిర్వహించారు. జోనోటిక్ వ్యాధుల సంక్రమణ, వాటి నివారణ, రక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. 70 పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్ వ్యాధి నివారణ టీకా వేశారు. పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అంటు వ్యాధుల్లో 60 శాతం కంటే అధికంగా కొత్తగా వస్తున్న అంటు వ్యాధుల్లో 75 శాతం జూనోటిక్ వ్యాధులే అన్నారు. రేబీస్ వ్యాధిపై అపోహలు, భయాందోళనలు, వాస్తవాలను వివరించినట్లు తెలిపారు.

**రేబీస్ వ్యాధి నివారణ టీకాలు పంపిణీ**

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టణంలోని పశువైద్యశాలలో ఆదివారం జూనోటిక్ వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడీ డాక్టర్ శ్రీనివాసుల గుప్త ఆధ్వర్యంలో 48 కుక్కలకు ఉచితంగా టీకా వేశారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. జూనోసిస్ దినోత్సవం జూనోటిక్ వ్యాధుల ప్రమాదాలు, ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజవర్గం పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం సిబ్బంది రామమూర్తి, గుల్షాద్‌బేగం, వెంకటరమణ, శివకుమార్ పాల్గొన్నారు.